క్లుప్తంగా

నలుగురిపై కేసు

కొవ్వూరు: ఔరంగబాద్‌లో రాజమహేంద్రవరం తాడితోటకు చెందిన జిల్లెళ్ల ప్రేమ్‌కుమార్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో చెర్రితో పాటు మరో ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కె.జగన్ మోహన్‌రావు బుధవారం తెలిపారు. ఈ నెల 3వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో ప్రేమ్‌కుమార్ ఇద్దరు స్నేహితులతో కలిసి ఔరంగబాద్‌లోని బంధువుల ఇంటికి వచ్చారు. అదే సమయంలో వారి ఇంటి ముందు చెర్రితో పాటు మరో ముగ్గురు యువకులు మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో ప్రేమ్‌కుమార్ బయట నిలబడి ఫోన్ మాట్లాడుతుంటే అతనితో చెర్రి గొడవ పడ్డారు. చెర్రితో పాటు మద్యం సేవిస్తున్న ముగ్గురు యువకులు కలిసి ప్రేమ్‌కుమార్‌ను తలపై బలంగా కొట్టారు. దీంతో తీవ్ర రక్తస్రావమైంది. బాధితుడుని రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్ మోహన్‌రావు తెలిపారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలి

నిడదవోలు రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై బుధవారం ఎన్నికల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఎక్కడా రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు లేకుండా చూడాలన్నారు. కార్యాలయ ఏఓ జగన్నాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి జోనల్ స్పోర్ట్స్ మీట్

నల్లజర్ల: స్థానిక భాష్యం స్కూల్లో ఈనెల 7, 8 తేదీల్లో బాలుర అండర్–14 విభాగంలో జోనల్ స్పోర్ట్స్ మీట్ జరుగుతుందని ప్రిన్సిపాల్ జీవై రాజు తెలిపారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఈ ఆటల పోటీలను ప్రారంభిస్తారని జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి 10 భాష్యం శాఖల నుంచి విద్యార్థులు హాజరుతారన్నారు. బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, కోకో, లాంగ్‌జంప్, 100, 400 మీటర్ల పరుగు ఆటలపోటీలు జరుగుతాయన్నారు. 8న విజేతలకు బహుమతులు సీఐ శ్రీనివాసరావు, భాష్యం విద్యాసంస్థల జోనల్ విద్యాధికారి శ్రీమన్నారాయణరెడ్డి అందజేస్తారన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడులో నూతనంగా నిర్మించిన సాయిబాబా మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలను బుధవారం ప్రారంభించారు. వేదపండితులు మానేపల్లి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం, అగ్నిప్రతిష్ఠాపన నిర్వహించారు. సుమారు రూ.కోటి వ్యయంతో సాయిరామ నిత్యలేఖన సమితి ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయం, జ్ఞాన మందిరాన్ని నిర్మించారు. ఈ నెల 7న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

త్వరితగతిన రీసర్వే పనులు



రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు, ఆర్డీవో రాణి సుస్మిత

దేవరపల్లి: రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. దేవరపల్లి మండలం చిన్నాయగూడెంలో జరుగుతున్న రీ సర్వే పనులను బుధవారం ఆయన పరిశీలించారు. రెవెన్యూ, సర్వే అధికారులకు, క్షేత్ర స్థాయి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. రీ సర్వేలో అభ్యంతరాలుంటే అర్జీదారులు సంతృప్తి చెందేలా వాటిని పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. మండల పరిధిలో రీ సర్వేకు చిన్నాయగూడెం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. గ్రౌండ్ ట్రూతింగ్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

చాగల్లు: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... చాగల్లు మండలం నెలటూరు గ్రామానికి చెందిన ఆలపాటి రామలక్ష్మికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంట్లో ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆమె రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కాగా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త ఆలపాటి శ్రీనివాసరావు చాగల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీనారాయణస్వామికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: మండలంలోని మునిపల్లిలో వేంచేసియున్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పాదయాత్రతో వచ్చిన భక్తులు స్వామివారి మొక్కులు తీర్చుకున్నారు. 11 ప్రదక్షిణలు, 7 వారాల కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు.

వైభవంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు

దేవరపల్లి: గౌరీపట్నంలోని గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పరివార దేవతలు, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ మహోత్సవాలకు ఈ నెల 2న శ్రీకారం చుట్టారు. శివ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగుతోంది. నిత్యం వేద పండితులతో హోమాలు, గోపూజ, వేద పారాయణ, నవగ్రహ హోమం జరుగుతున్నాయి. సుమారు రూ.7 కోట్ల వ్యయంతో గ్రామస్తులు, దాతల సహకారంతో స్వామి వారి ఆలయాన్ని ఇక్కడ పునర్నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 52 అడుగుల ఎత్తయిన జీవ ధ్వజస్తంభాన్ని శుక్రవారం ప్రతిష్ఠించనున్నారు. ఆంద్రు శ్రీనివాస్, ఉషారాణి దంపతుల ఆధ్వర్యాన ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగుతున్నాయి. శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యాన బుధవారం యంత్రబింబ స్థాపనలు, పూజలు నిర్వహించారు. జీవ ధ్వజస్తంభానికి కూడా పూజలు నిర్వహించారు. మహానందికి విశేష అభిషేకం వైభవంగా జరిగింది. గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహమణ్యేశ్వరస్వామి వార్ల దివ్య కల్యాణ మహోత్సవాలు శుక్రవారం



జీవ ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

నిర్వహించనున్నారు. అదే రోజు ఉదయం 11 గంటల నుంచి భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నారు.

మహాలింగేశ్వరుని దర్శించుకున్న మాజీ మంత్రి

దేవరపల్లి: గౌరీపట్నంలో వేంచేసిన గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామిని మాజీ హోంశాఖ మంత్రి తానేటి వనిత, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌చార్జి తలారి వెంకట్రావు బుధవారం రాత్రి దర్శించుకున్నారు. వేద పండితులు స్వాగతం పలికారు. జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మహానంది అభిషేక కార్యక్రమంలో తానేటి వనిత, తలారి వెంకట్రావు పాల్గొని పూజలు నిర్వహించారు. వేదపండితులు వీరిని ఘనంగా సత్కరించి వేద ఆశీర్వాదం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవరపల్లి, గోపాలపురం ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు, మండల పార్టీ అధ్యక్షులు కూచిపూడి సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు గడా జగదీష్, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, నరహరిశెట్టి సుధాకర్, కడలి హైమావతి, దేవస్థానం ట్రస్ట్ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.



గౌరీపట్నంలో ఆలయ పునఃప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ మంత్రి తానేటి వనిత

డ్రైవర్లకు మానసిక ప్రశాంతత అవసరం



కొవ్వూరులో ఆర్టీసీ డ్రైవర్ల కుటుంబ సభ్యులకు చీరలు పంపిణీ చేస్తున్న డిపో మేనేజర్ కుమార్

కొవ్వూరు: డ్రైవర్లు విధులు నిర్వర్తించడానికి మానసిక ప్రశాంతత, ఏ విధమైన ఒత్తిడి లేకుండా ఉండేటట్లు కుటుంబ సభ్యుల సహకారం అవసరమని ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం యాక్సిడెంట్స్ నియంత్రించేందుకు డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణకు వచ్చే సమయంలో కుటుంబ సభ్యులు ఆయనపై ఏ విధమైన ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా చిరునవ్వుతో పంపించాలని సూచించారు. ఆరోగ్యం విషయం అశ్రద్ధ చేయకుండా ఎప్పటికప్పుడు చెకప్ చేయించుకోవాలని సూచించారు. ఓర్పు, సహనంతో పాటు మంచి ఆలోచనలతో ఉన్నప్పుడే ప్రశాంతంగా విధులు నిర్వర్తించగలుగుతారన్నారు. తుమ్మిడి బ్రదర్స్ సౌజన్యంతో ఆర్టీసీ ఆడపడుచులకు చీర, తాంబూలం అందజేశారు.

కూరగాయలు, ఆకుకూరలకు ప్రాధాన్యం ఇవ్వాలి



కె.సావరంలో బాలింతలకు, గర్భిణులకు ఆకుకూరలు, కూరగాయలు అందజేస్తున్న డాక్టర్ ప్రసాద్

ఉండ్రాజవరం: ఇంటి ఆవరణలో పెంచుకున్న కూరగాయలు, ఆకుకూరలకు బాలింతలు, గర్భిణులు ప్రాధాన్యం ఇవ్వాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. మండలంలో కె.సావరంలో అంగన్వాడీ కోడ్ నెంబర్ 155 సిబ్బంది నిర్వహించే పోషణ వాటిక కార్యక్రమంలో భాగంగా స్వయంగా పండించిన ఆకుకూరలను గర్భిణులకు, బాలింతలకు బుధవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పరివేక్షకులు కె.నాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు జి.పద్మావాణి, కె.లక్ష్మి, ఆరోగ్య కార్యకర్త వై.రత్నకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ బులి వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ బుధవారం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. యువజన విభాగం అధ్యక్షుడిగా సక్కా నాగసత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా దాకారపు బంగారమ్మ, రైతు విభాగం అధ్యక్షుడిగా సత్తి జగదీశ్వరరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా దోపసాని రాధాకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కాకులపాటి శ్రీను, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా లావూరి చిన్న వెంకన్న, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ ముస్తఫా, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా పిట్టా జాన్ సుకుమార్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా మురమళ్ల సత్యనారాయణ, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా సున్నం నాగవరప్రసాద్, మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా పిచ్చుకల ప్రసాద్, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా బాల వెంకటేశ్వరరావు, వలంటీర్స్ విభాగం అధ్యక్షుడిగా షేక్ నబీసాహెబ్, గ్రీవెన్ సెల్ అధ్యక్షుడిగా కురుకూరి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా బొమ్మా మురళీకృష్ణ, వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా నందా ఉదయ బాలాజీ, వైఎస్సార్ టీయూసీ విభాగం అధ్యక్షుడిగా మద్దూరి నాగేశ్వరరావు, లీగల్ సెల్ అధ్యక్షుడిగా బొడ్డిగర్ల రాంబాబు, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా టేకు సత్తిబాబు, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా గొర్రెల సాంబశివ నాయుడు, ఐటీ విభాగం అధ్యక్షుడిగా కేజీఆర్ కొండాబత్తుల గిరి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా కస్సే కృష్ణారావు, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా కణసాల వెంకటరమణ, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడిగా చిలకా నాగవెంకటసత్యదుర్గరాజు, ఇంటలెక్చువల్ ఫోరం విభాగం అధ్యక్షుడిగా పాకలపాటి త్యాగభీమేశ్వరరావు, బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడిగా ఆచంట సురేష్ నియమితులయ్యారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు నియామకం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వివిధ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించారు. యువజన విభాగం అధ్యక్షుడిగా రాచకొండ సురేష్, మహిళా విభాగానికి ముప్పిడి దమయంతి, రైతు విభాగం అధ్యక్షుడిగా మద్దూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు తోట నారాయణరావు నియమితులయ్యారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా వేములూరు సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఔరంగబాద్‌కు చెందిన మెరిపో వీర్రాజు, ఎస్టీ సెల్‌కు పల్లయ్య, మైనారిటీ విభాగానికి షేక్ యూసఫ్ షరీఫ్‌లను నియమించారు. క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఆనంద్ విజయ్‌కుమార్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా మజ్జి జ్యోతి సాయి వంశీ, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా గజ్జరం సర్పంచ్ కుదపా రాంబాబు, ఆర్‌టీఐ వింగ్‌కు కొవ్వూరు పట్టణానికి చెందిన మాసా ఆనంద్, వలంటీర్ విభాగానికి మల్లవరపు రాజు, గ్రీవెన్స్ సెల్‌కు కొవ్వూరు పట్టణానికి చెందిన బోప్పా అప్పలనాయుడు, వాణిజ్య విభాగం అధ్యక్షురాలిగా కొవ్వూరు పట్టణానికి చెందిన మునిసిపల్ కౌన్సిలర్ అంకోలు లిల్లీ వెంకట పద్మలీల, వీవర్స్ విభాగానికి దొంగా రాజారావు, వైఎస్సార్ టీయూ విభాగానికి పలపాల సూర్యచంద్రరావు, అంగన్‌వాడీ విభాగానికి కట్టా ఉమామహేశ్వరి, లీగల్ సెల్‌కు పట్టణానికి చెందిన న్యాయవాది కవల నాగేశ్వరరావు నియమితులయ్యారు. సోషల్ మీడియా విభాగానికి దాకే ధర్మరాజు, ఐటీ విభాగానికి పట్టణానికి చెందిన గంగాధర నాగేశ్వరరావు, డాక్టర్స్ విభాగానికి పెమ్మడి సత్తిరాజు, పబ్లిసిటీ విభాగానికి నందమూరుకు చెందిన మారిన వెంకట రామకృష్ణ, ఇంటలెక్చువల్స్ ఫోరమ్‌కు పట్టణానికి చెందిన బోడపాటి హనుమంతరావు, బూత్ కమిటీకి తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కులు



నిడదవోలు వద్ద పశ్చిమడెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు సాగునీటి విడుదలను తగ్గించారు. ప్రస్తుతం ప్రధాన కాలువలకు 4,000 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. గోదావరి పశ్చిమడెల్టా పరిధిలో రైతుల సాగునీటి అవసరాల మేరకు జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు నీటి విడుదలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తున్నారు. పశ్చిమడెల్టా పరిధిలో నరసాపురం కాలువకు అత్యధికంగా 1469 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఏలూరు కాలువకు 1056, తణుకు కాలువకు 787, అత్తిలి కాలువలకు 365 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

గీత కార్మికుల మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు పెంపు



కె.సత్యనారాయణ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ, కొవ్వూరు

కొవ్వూరు: కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించిన రెండు మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువుని ఈనెల 8వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.సత్యనారాయణ తెలిపారు. ముందు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల ఐదుతో గడువు ముగిసింది. మండలానికి ఒక్కో మద్యం దుకాణం చొప్పున చాగల్లు, తాళ్లపూడి మండలాలకు రెండు మద్యం దుకాణాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకి చెందిన బీసీ శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఈ దుకాణాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోగానీ, ఆఫ్‌లైన్‌లో ఈనెల 8వ తేదీ సాయంత్రం ఐదుగంటల్లోపు సమర్పించాలని ఆయన సూచించారు. తొమ్మిదో తేదీన దరఖాస్తులు పరిశీలన చేస్తామన్నారు. పదో తేదీ ఉదయం పది గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి.ప్రశాంతి ఆధ్వర్యంలో లక్కీడిప్ ద్వారా డ్రా తీయనున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తులతో పాటు బీసీ శెట్టిబలిజ కుల ధ్రువీకరణ పత్రం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థానికతను తెలియజేసే ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి వరకు చాగల్లు మండలానికి ఒకటి, తాళ్లపూడి మండలం దుకాణానికి ఒకటి చొప్పున మాత్రమే దరఖాస్తులు అందాయన్నారు. దీంతో దరఖాస్తు గడువుని ఎనిమిదో తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆయన తెలిపారు.

నిడదవోలులో..

నిడదవోలు: గీత కార్మికులకు కేటాయించబడిన మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు పెంచినట్లు నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్‌జే సతీష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గీత కులాల వారికి కేటాయించిన మద్యం షాపులకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని నిడదవోలు ఎక్సైజ్ సీఐ సతీష్‌బాబు తెలిపారు.

సస్యరక్షణతో ఆయిల్‌పామ్‌లో అధిక దిగుబడులు



ఆయిల్‌పామ్ రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త రేఖ

నల్లజర్ల: ఆయిల్‌పామ్ తోటల్లో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని డాక్టర్ వైఎస్సార్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఇ.రేఖ ఉద్యాన రైతులకు సూచించారు. దూబచర్లలో సర్పంచ్ తాడిగడప బాలయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన రైతు సదస్సులో ఆమె మాట్లాడారు. తోటల్లో ఎప్పటికప్పుడు తుక్కు, పెంట లేకుండా చూసుకుంటే కొమ్ము, ఎర్ర ముక్కు పురుగుల ఉధృతిని తగ్గించవచ్చన్నారు. ప్రతి రెండున్నర ఎకరాలకు ఒక లింగాకర్షక బుట్ట ఏర్పాటు చేయడం ద్వారా పురుగుల ఉధృతి తగ్గించవచ్చని చెప్పారు. వీటి కోసం రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఈ ఏడాది అన్ని తోటల్లో కాండం కుళ్ల తెగులు ఆశించిందని, దీని నివారణకు ప్లాంటోమైసిన్ 2 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి మొవ్వు భాగంలో పిచికారీ చేయడం, వేరు ద్వారా ఇంజక్షన్ చేయాలని సూచించారు. నీరు ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు వెళ్లడం ద్వారా గానోడెర్మా తెగులు వ్యాపిస్తుందన్నారు. డ్రిప్ ద్వారా నీరందించడం శ్రేయస్కరమన్నారు. ఏయే సమయాల్లో ఎరువులు వినియోగించాలో రేఖ వివరించారు. నల్లజర్ల ఉద్యాన శాఖాధికారి ఎం.బబిత మాట్లాడుతూ, చెట్టుకు పళ్లాలు చేయడం ద్వారా వివిధ రకాల తెగుళ్లను నివారించుకోవచ్చునన్నారు. మూడేళ్లలోపు చెట్లకు మీటరు నుంచి రెండు మీటర్ల వెడల్పున పళ్లాలు చేసుకోవడం ద్వారా పీచువేర్లు దెబ్బ తినకుండా ఉంటాయన్నారు. తద్వారా ఎరువుల యాజమాన్యం సక్రమంగా ఉంటుందన్నారు. చెట్టుకు సంవత్సరానికి 50 నుంచి 100 కేజీల పశువుల పెంట, 2.5 కిలోల నత్రజని, 3 కిలోల భాస్వరం, 3.50 కిలోల పోటాష్, 100 గ్రాముల బోరాన్, 250 గ్రాముల మెగ్నీషియం వేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

దేవరపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అధ్యక్షతన స్థానిక కరుటూరి ఫంక్షన్ హాలులో బుధవారం జరిగిన బూత్ కమిటీ కన్వీనర్లు, కూటమి శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోపాలపురం నియోజకవర్గంలో 8,650 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, ప్రతి 30 మంది ఓటర్లకు బూత్ కన్వీనర్ ఉన్నందున ప్రతి ఓటు వేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు, నాలుగు మండలాల టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరులో...

కొవ్వూరు: ఉభయ గోదావరి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. పట్టణంలో టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కూటమి అభ్యర్థిని అఖండ మేజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. అనంతరం మంత్రి రామానాయుడును ఎమ్మెల్యే, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

పెరవలి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా పనిచేసి కూటమి అభ్యర్థిని గెలిపించాలని మంత్రి రామానాయుడు తెలిపారు. పెరవలి మండలం కానూరు వైనాట్ ఫంక్షన్ హాల్‌లో నిడదవోలు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కోరారు. మంత్రి కందుల దుర్గేష్ కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదత రులు పాల్గొన్నారు.

బాలుడిపై దాడి కేసులో ఇద్దరి అరెస్టు

చాగల్లు: బాలుడిపై దాడి చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు చాగల్లు పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ పి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు . వివరాల్లోకి వెళితే.. కొవ్వూరుకు చెందిన 15 ఏళ్ల బాలుడు కర్ర అవినాష్ కుమార్‌పై చాగల్లుకు చెందిన కోతాడ నాగ శివసాయి కుమార్ అలియాస్ సాయి, తోర్లపాటి దుర్గాప్రసాద్ ఈ నెల 1న చాగల్లులో దాడి చేశారు. అవినాష్ కుమార్‌ను తీవ్రంగా కొట్టి గాయపరిచారు. ఈ కేసులో నిందితులు సాయి, దుర్గాప్రసాద్‌లను అరెస్టు చేసి నిడదవోలు కోర్టులో హాజరుపరచగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్టు హెచ్‌సీ పి.శ్రీనివాసరావు తెలిపారు.

ఆకుకూరల పంపిణీ

చాగల్లు: స్థానిక అంగన్ వాడీ కేంద్రం–64లో బాలింతలు, గర్భిణులకు బుధవారం ఆకుకూరలు పంపిణీ చేశారు. పోషణ వాటిక కార్యక్రమంలో భాగంగా సీడీపీవో డి.మమ్మీ ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. బాలింతలు, గర్భిణులు ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

నిడదవోలు: పట్టణంలోని బసివిరెడ్డిపేటలో పశ్చిమడెల్టా ప్రధాన కాలువ ఒడ్డున వేంచేసిన అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలను ఈనెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించడానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆలయంలో ఈనెల 27న ఉదయం 8:30 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుని చేయుట, పూజలు ప్రారంభం, నీరాజన మంత్రపుష్పార్చనలు నిర్వహించనున్నారు. ఈనెల 8న సాయంత్రం 6 గంటలకు స్వామివారి కల్యాణం, ఈనెల 9న శ్రీవారి రథోత్సవం, ఈనెల 10, 11 తేదీల్లో స్వామివారి సహస్ర నామార్చనలు, ఈనెల 12న ఉదయం 8 గంటలకు సహస్ర నామార్చన పూజలు, చక్రస్నానం నిర్వహిస్తారు. ఈనెల 13న సాయంత్రం 6 గంటలకు శ్రీపుష్పయాగోత్సవం (పవళింపు సేవ) కార్యక్రమాల నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహక సభ్యులు వెలగల జయచంద్రారెడ్డి, కేదారిశెట్టి నెహ్రూ తెలిపారు.



అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి

రైస్ మిల్లును తనిఖీ చేసిన జేసీ చిన్నరాముడు

దేవరపల్లి: స్థానిక వెంకటేశ్వ రైస్ మిల్లును జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. మిల్లులో ఉన్న ధాన్యం, బియ్యం నిల్వలను ఆయన పరిశీలించారు. కస్టోడియన్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) రికార్డులను పరిశీలించారు. సీఎంఆర్‌ను రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని మిల్లర్‌ను జేసీ ఆదేశించారు. మండల సరఫరా అధికారి ఎం.సత్యనారాయణ, వీఆర్వోలు పండు, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

గోపాలపురం: రబీ సీజన్‌లో 14వేల ఎకరాలలో వ్యవసాయ పంట సాగుకు యూరియా అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి బి రాజారావు తెలిపారు. రైతులకు అవసరమైన యూరియాను ముగ్గురు ప్రైవేటు డీలర్లు, రెండు డీసీఎంఎస్‌ల ద్వారా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికి 3600 మెట్రిక్ టన్నులకు గాను 2500 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. సేంద్రియ, రసాయనిక ఎరువులను సమన్వయంగా ఉపయోగించాలని సూచించారు.

జేసీబీలు, లారీల సీజ్

గోపాలపురం: అనధికారికంగా జరుగుతున్న మట్టి తవ్వకాలపై దాడి చేసి రెండు జేసీబీలు, నాలుగు లారీలను సీజ్ చేసినట్లు ఎస్సై కర్రి సతీష్ కుమార్ తెలిపారు. గోపాలపురం మండలం గుడ్డిగూడెం రోడ్డులోని ఒక పొలంలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి, లారీలలో ఇటుక బట్టీలకు తరలిస్తున్నారన్నారు. దానిపై అందించిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి, రెండు జేసీబీలు, నాలుగు లారీలను పట్టుకున్నట్లు తెలిపారు. వీటిని జిల్లా మైనింగ్ అధికారులకు అప్పగిస్తామన్నారు.

సమీకృత వ్యవసాయ పద్ధతులపై అవగాహన

తాళ్లపూడి: రైతులు సాగులో నూతన పద్ధతులను అవలంబిస్తే మంచి ఫలితాలు వస్తాయని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ (సెర్ప్) ఎన్‌వీఎస్ మూర్తి తెలిపారు. మండలంలోని రావూరుపాడు రైతు సేవా కేంద్రంలో బుధవారం సమీకృత వ్యవసాయ పద్ధతులపై మహిళా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షురాలు బందారు నాగకుమారి అధ్యక్షతన జరిగిన సభలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి మాట్లాడుతూ రైతులు ఆహార పంటలతో పాటు ఉద్యానవన పంటలు, చేపల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్, డీపీఎం వల్లి హేమంత్, మండల ఏపీఎం మంగాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు మానుకోవాలంటూ నిరసన

కొవ్వూరు: ఎండీయూ ఆపరేటర్లపై రాజకీయ కక్ష సాధింపులు మానుకోవాలని, తమ ఉపాధికి భద్రత కల్పించాలని కోరుతూ ఎండీయూ ఆపరేటర్లు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల దొమ్మేరుసావరానికి చెందిన బొల్లవరపు రవికుమార్ అనే ఆపరేటర్‌ను తొలగించి వేరొకరిని నియమించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. బాధితుడు రవికుమార్ మాట్లాడుతూ తనకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వాహనం మంజూరు చేశారన్నారు. గడిచిన నాలుగేళ్ల నుంచి దీనిపై ఆధారపడి తన కుటుంబం జీవిస్తుందన్నారు. ఏ విధమైన రిమార్కు లేకుండా పనిచేస్తున్నానని, దొమ్మేరు సావరంలో 50, 51, కాపవరంలో 41 రేషన్ దుకాణాల పరిధిలో రేషన్ అందిస్తున్నానని తెలిపారు. ఇటీవల తనను తొలగించి వేరొకరికి ఆ బాధ్యత అప్పగించడంతో తన కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనను రాజకీయ ఒత్తిడి కారణంగానే తొలగించినట్లు ఆరోపించారు.